

## ముందుకు పోదామా! ఎన్కకా!!

కాంగ్రెస్ పాలన చేనేత కార్మికులను బలితీసుకుంది. వరుస పెట్టి నేత కార్మికులు బలవన్మరణం చెందుతున్నా నాటి ప్రభుత్వాలు కనికరం చూపించలేదు. నేతన్నల బలవన్మరణాలు, ఆకలిచావులను చూసి చలించిపోయిన సీఎం కేసీఆర్ వారికి ఆర్థిక భరోసా కల్పించడానికి నెలకు రూ.2 వేల పింఛన్ ఇస్తున్నారు. దీంతో 37,296 మంది లబ్ధి పొందుతున్నారు. ఇంతకుముందు ఎన్నడూ, ఎవరూ చేనేత కార్మికులకు పింఛన్ ఇవ్వాలన్న ఆలోచన చేయలేదు. పింఛన్‌తోపాటు నేతన్నలకు బీమా కూడా అందుబాటులోకి తెచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం.

### మగ్గం తగ్గుతలే.. సాయం ఆగుతలే..

**పదేండ్లు** ఎన్కకు పోతే.. మా బతుకులు అతుకుల బొంతలెక్కనే ఉంటుండే. చేయనీకి పని ఉండక పోవు. పైసలు ఎల్లకపోవు. పొద్దున తింటే.. రాత్రికి తిండి గింజలు పుట్టకపోవు. పొద్దంతా మగ్గం ఆడించినా.. రూపాయి కండ్ల జూడకపోవు. నెలంతా కష్టపడితే అచ్చిన పైసలు ఏ మూలకో పోతుండే! దస్తర్ చూస్తే ఉరిపోసుకున్న నేతన్నల వార్తలే కండ్లవడ్తుండే! గవ్వి చూసినప్పుడు మనసుకు కష్టమైతుండే. ఈడ పని దొర్కక చానమంది భీవండీ, సూరత్ పోయిన్రు. అక్కడ కడుపు కట్టుకుని రెక్కలు ముక్కలు చేసి.. నాలుగు రూపాయలు ఇండ్లకు పంపేది. గిట్ల ఉంటుండే మా బతుకులు. నేత పని ఇడ్శిపెట్టి ఏదన్న కూలికి పోయింది నయమనుకున్న రోజులుండే. తెలంగాణ సర్కార్ ఒచ్చినంక నేత కార్మికులకు జెరంత ఆసరొచ్చింది. రోజంత నడుములోతు గుంతల దిగి, వంగి మగ్గం నేసుడంటే అల్కటి పని కాదు. అంతజేశినా.. రోజుకు ఒక్క చీరనే అయితది. దానికి రెండు వందలు ఇస్తరు. అవి ఏమిట్కి కావు. అయినా ఈ పని ఇడ్శి వేరే పనికి పోనీకె మనసొప్పదు. మాకు సాయంగా చేనేత కార్మికులకు కేసీఆర్ సర్కార్ రెండు వేల పింఛన్ ఇస్తున్నది. ఇంట్ల ఖర్చులకు, నెలకు సరిపోయే కిరాణా సొదలు వస్తున్నయ్. పింఛన్ పైసలు ఠంచన్‌గా పడుతుండటంతో మాకు మస్తు ఆసరైతున్నయ్.

- పూడూరు రాములమ్మ, చేనేత కార్మికురాలు, నారాయణపేట







### ఆత్మవిశ్వాసంతో నేతన్న

ఉద్యమ సమయంలో నేత కార్మికుల దీనావస్థను చూసి అనేకసార్లు దుఃఖపడ్డ. ఒకరోజు పేపర్లో సిరిసిల్లలో ఒకేరోజు 11 మంది చేనేత కార్మికులు మృతిచెందారన్న వార్త వచ్చింది. అది చూసి మనసు చలించిపోయింది. అప్పటి ప్రభుత్వం నుంచి వారికి సాయం అందే పరిస్థితి లేదు. అందుకే నేనే పూనుకొని మా పార్టీ తరఫున రూ.50 లక్షలను సిరిసిల్ల కార్మికుల కోసం పంపాను. నేడు తెలంగాణలో నేతన్న ఆత్మహత్యలు ఆగిపోయాయి. ప్రభుత్వ సహకారంలో మన నేతన్నలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తున్నారు.

- కేసీఆర్

ఎటమటం!

## పిలవని పేరంటానికి ఎందుకని..

**ఎన్నికల** ప్రచారం ముగిసేందుకు ఇంకా పట్టుమని వారం రోజులు కూడా లేదు. మరి ఇంకెప్పుడు ప్రచారానికి వెళ్తారని డబుల్ ఇంజిన్ పార్టీలో కిషన్ రెడ్డి గురించి సీరియస్‌గా చర్చ జరుగుతున్నది. 'అసలు ఆయనకు ప్రచారానికి వెళ్లే ఉద్దేశం ఉన్నదా?, లేదా? లేక డబుల్ ఇంజిన్‌కు డీజిల్ దండుగ అనుకుంటున్నారా?' అని పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారట. 'వెళ్లడానికి అభ్యంతరం లేదు కానీ.. పిలవని పేరంటానికి వెళ్తే ఏం బాగుంటుంది చెప్పమ'ని కిషన్‌రెడ్డి ఎదురు ప్రశ్నిస్తున్నారట. 'సీత కష్టాలు సీతవి.. పీత కష్టాలు పీతవి. నా పరిస్థితి మీకు అర్థం కాదులే!' అని తన సన్నిహితుల దగ్గర వాపోతున్నారట. 'తెలంగాణలో వచ్చేది డబుల్ ఇంజిన్ సర్కారే అని బడా నేతలంతా భాషణలు దంచి వెళ్తుంటే, మీరు హైదరాబాద్ విడిచి కదలకుంటే ఎలా? ప్రచారానికి



ఎవరు వెళ్లినా వెళ్లకపోయినా పెద్దగా ఫరక్ పడదు కానీ.. కనీసం జనాలైనా ఏమనుకుంటారో ఆలోచించాల'ని సీనియర్లు నిష్ఠురంగా మాట్లాడుతున్నారట. ఎన్నికల షెడ్యూల్ వచ్చాకేమో దసరా తర్వాత వెళ్తానన్న కిషన్ జీ.. అది వెళ్లాక దీపావళి, అమావాస్య దాటాక వెళ్తానని ప్రెస్‌మీట్ పెట్టి మరీ ప్రకటించారు. ఇప్పుడేమో కార్తీక పున్నమి.. దివ్యమైన ముహూర్తం అప్పుడు బయలుదేరుతానని చెబుతున్నారు. ఈ నెల 28న ఎలాగూ ప్రచారం ముగియనుండగా .. మిగిలేది రెండు రోజులే. అప్పుడు రాష్ట్రమంతా ఎలా తిరుగుతారని అడుగుతున్నారట. అసలు ఆయన ఎందుకిలా వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నారని ఆరా తీస్తే, అసలు విషయం బయటపడింది. రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌ని మార్చడం వల్ల పార్టీ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయిందని, పరిస్థితి బాగా లేనప్పుడు పోటీ చేసి పరువు పోగొట్టుకునే కంటే చేయకపోవడమే బెటర్ అని డీకే అరుణ, జితేందర్‌రెడ్డి, మురళీధర్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితర ముఖ్యనేతలంతా అస్త్ర సన్యాసం చేశారు. ఇతర నేతలు కూడా పోటీకి పెద్దగా ఆసక్తి చూపకపోయినప్పటికీ, ఏదో కొందరిని బతిమాలి, బామాలి బరిలోకి దింపితే, వారేమో మాట వరుసకైనా ప్రచారానికి రమ్మని కిషన్‌రెడ్డిని పిలవడం లేదట. దీంతో పిలవని పేరంటానికి వెళ్లడం కంటే నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరగడమే బెటర్ అని ఫిక్సయినట్టున్నారు కిషన్‌జీ.


- వెల్జాల

'ఓ తల్లి ప్రసవ వేదన పడుతున్నది. గంటలు గడుస్తున్నా ప్రసవం కావడం లేదు. తల్లినీ, బిడ్డనూ కాపాడుకుందామని దవాఖానకు వచ్చారు. అక్కడో తెలివైన వైద్యుడు.. ఓ పది రూపాయలు లంచం ఇస్తాను త్వరగా పుట్టమ్మా' అని కడుపులోని బిడ్డకు చెప్పాడు. గంటలు వేదనపడ్డా పుట్టని బిడ్డ.. లంచం మాట వినగానే క్షణాల్లో బయటికి వచ్చింది. ఇందిరాగాంధీ పాలనలో పుట్టబోయే బిడ్డకూడా లంచాలకు అలవాటుపడేలా కాంగ్రెస్ పాలన దిగజారింద'ని ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో స్వతంత్ర పార్టీ ఎమ్మెల్సీ కొణిజేటి రోశయ్య విమర్శించారు. ఇదీ.. ఇందిరమ్మ పాలనంటే!! ఆనాడే కాదు.. నేటి వరకూ ఆ పార్టీ అవినీతి పంకిలం. కుంభకోణాలకు నిలయం. స్కాంగ్రెస్‌గా వినుతికెక్కిన కాంగ్రెస్‌లో టికెట్లు అమ్ముకునే నేటి సంస్కృతికి 'నాటి.. ఇందిరమ్మ రాజ్యం' నాంది పలికింది.

'ఇందిరమ్మ రాజ్యం తెస్తాం..' అనేది కాంగ్రెస్ నాయకులకో ప్రార్థన గీతం అయింది. ఈ జమానాకు ఆమె రాజ్యం ఎలా ఉండేదో తెలియదు కాబట్టి ఏం మాట్లాడినా చెల్లుబాటు అవుతుందని అనుకుంటున్నారు. కానీ, అప్పట్లో ఇందిరమ్మ రాజ్యం ఎంత సక్కగ ఉండేదో చెబితే అసలుకే ఎసరొస్తుందని.. పాలన తెస్తామంటారే కానీ, ఆమె హయాంలో జరిగిన సంగతులు ప్రస్తావించే సాహసం చేయడం లేదు.

ఇందిరాగాంధీ హయాంలో రాష్ట్రంలో ఆంధ్రా పాలకుల ఆధిపత్యం. తెలంగాణ నేతలది బానిసత్వం. వెరిసి ప్రాంతీయ అసమానతలు. రాజకీయ అస్థిరత! ఏడాదికో ముఖ్యమంత్రి. ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు, మూడో కృష్ణుడి ఆగమనం.. రాష్ట్రమంతా ఆగమాగం ఇదీ అసలు చరిత్ర!

నేటి కాంగ్రెస్ నేతలు చెబుతున్న నాటి ఇందిరమ్మ రాజ్యంలో.. ఎవరికి ఎప్పుడు మూడుతుందో తెలియదు, ఎవరి పదవి ఎలా ఊడుతుందో తెలియదు! సీటును కాపాడుకోవడమే లక్ష్యంగా ఢిల్లీ చుట్టూ నేతల లాబీయింగ్. పాలనను గాలికి వదిలేసి కుటిల రాజకీయాల్లో తలమునకలు కావడం ఇదీ చిత్రం. రాజకీయ సంక్షోభాలు, అస్థిర ప్రభుత్వాలు, పాలన గాడి తప్పడంతో పెచ్చరిల్లిన అరాచకాలు, మత కలహాలు, ఉపాధి కరువై ఉగ్రవాదానికి ఆకర్షితులైన యువత... పదహారేండ్లు ఇదీ సీను!




# ఆకలి.. నిరుద్యోగం.. అవినీతి..



## ఇదీ.. ఇందిరమ్మ రాజ్యం!

...✍ వెల్జాల చంద్రశేఖర్, కడవేర్గు రాజశేఖర్

- దేశంలో ఎమర్జెన్సీ విధించిన ఏకైక ప్రధాని
- కడుపునిండా తిండిలేదు.. కంటి మీద కునుకు లేదు
- ఒకవైపు నక్సలిజం.. మరోవైపు మత కలహాలు
- శాంతిభద్రతలు శూన్యం.. కర్ఫ్యూతో కట్టడి
- రాజకీయ అస్థిరత.. ప్రాంతీయ అసమానతలు
- ఢిల్లీ చుట్టూ లాబీయింగ్‌లు.. ఏడాదికో సీఎం



సాగునీటి వనరులు లేక పగుళ్లు బాసిన పంట పొలాలు. జీవనాధారం లేక కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు, భార్యాపిల్లలను ఊర్లోనే వదిలేసి ఎల్లలు దాటి వలసలు. అధికార యావ తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టని నాటి నేత పాలనను మేటిగా అభివర్ణిస్తూ.. నేటి కాంగ్రెస్ చెబుతున్న మాటలు హాస్యాస్పదంగా ఉంటున్నాయి. అసలు ఇందిరమ్మ రాజ్యంలో దేశం, మన రాష్ట్రం ఎలా ఉండేదంటే..

**హిట్లర్,** ముస్సోలిని వంటి నియంతలకు మాత్రమే రాజ్యాంగం మెడలు వంచి మరీ అత్యున్నతాధికారాలు కైవసం చేసుకొన్న చరిత్ర ఉన్నది. అయితే, అత్యాయిక స్థితి, ప్రజాహక్కుల ఉల్లంఘనలు, స్వార్థపూరిత నిర్ణయాలతో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కూడా వారి వరుసలో చేరారు. తెలంగాణ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు ఇందిరమ్మ రాజ్యం మళ్లీ తీసుకొస్తామని చెబుతున్నారు. అయితే, 16 ఏండ్ల (1966–1977, 1980–1984) ఇందిర రాజ్యంలో ఏముందని ప్రశ్నిస్తే..? ఎమర్జెన్సీ చీకటి రోజులు, ఎక్కడ చూసినా ఆకలికేకలు, రైతు ఆత్మహత్యలు, విద్యార్థి, రైతు ఉద్యమాల అణచివేతలు, హక్కుల ఉల్లంఘనలు, ఎన్‌కౌంటర్లు. ఇదీ చరిత్ర చెబుతున్న సత్యం.

### ప్రజల పాట్లు...వర్ణనాతీతం

హస్తినలో ఇందిర రాజ్యమేలుతున్న సమయంలో అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో.. ముఖ్యంగా మన తెలంగాణ ప్రాంతంలో ప్రజల బాధలు వర్ణనాతీతం. సాగునీటి వనరులు లేక వర్షాధార పంటలే శరణ్యం. వర్షాభావ పరిస్థితులతో ఏటికేడు పంట దిగుబడి పడిపోయేది. దీనికితోడు భూమి శిస్తు భారం రైతులను కలవరపెట్టింది. పెట్టుబడి కోసం అధిక వడ్డీలతో అప్పులు చేయాల్సిన దుస్థితి. దిక్కుతోచక పరువు కోసం వేలాది మంది రైతులు బలవన్మరణం చెందారు. వడ్డీ వ్యాపారుల సంగతి అలా ఉంచితే, పదో, పరకో అప్పు ఇచ్చిన సహకార పరపతి సంఘాలు (అంజుమాన్ బ్యాంక్) నిర్దాక్షిణ్యంగా ముక్కుపిండి వసూళ్లు చేసేవి. ఆదుకోవాల్సిన సర్కారే కనికరం లేకుండా బకాయిల వసూళ్ల కోసం చెంబులు, గిన్నెలు బజార్లలో విసిరేసి రైతుల జీవితాలను బజారుపాలు చేసింది. రెక్కాడినా డొక్క నిండని పరిస్థితిలో ఏ ఊర్లో చూసినా పేగుల కేకలే! తినడానికి తిండిలేక ఆకలి చావులే!

### శాంతిభద్రతలకు విఘాతం

ఇందిరాగాంధీ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలను పట్టించుకున్న నాథుడే లేడు. మత కలహాలు నిత్యకృత్యంగా ఉండేవి. తీవ్రవాదం పెరిగింది, నక్సలిజం రాష్ట్రమంతా విస్తరించింది. మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, 1978 మార్చి 24న హైదరాబాద్‌లో రమీజా బీ అనే మహిళపై అత్యాచారం, ఆమె భర్త అహ్మద్ హుస్సేన్ లాకప్ డెత్ ఉదంతం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై హైదరాబాద్‌లో హింస చెలరేగింది. వారం తిరక్కుండానే మార్చి 31న రమీజా బీని పోలీసులు కాల్చి చంపినట్టు పుకార్లు వ్యాపించాయి. దీంతో హైదరాబాద్ అట్టుడికిపోయింది. నగరంలో ఒకేరోజు 11 చోట్ల పోలీసులు కాల్పులు జరిపారు. దీంటో 15 మంది చనిపోయినట్టు అధికారికంగానే ప్రకటించారు. ఈ ఉత్పాతం పర్యవసానం.. రాష్ట్ర రాజధాని 50 రోజులపాటు కర్ఫ్యూ నీడలో భయంగా కాలం వెళ్లదీసింది.

ఇక అప్పటి నుంచి హైదరాబాద్ మత కలహాలు, బందులు, బందూక్‌లకు కేరాఫ్‌గా మారిపోయింది. అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1980, ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో అల్లర్లు జరగడంతో వారం రోజులపాటు కర్ఫ్యూ విధించారు. అందులో 40 మంది మరణించినట్టు, 300 మంది గాయపడినట్టు అనధికారిక లెక్క. ఇలా కాంగ్రెస్ నేతలు చెబుతున్న ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ ప్రాంతం రాజకీయ అస్థిరత, మత కల్లోలాలు, ఆకలి కేకలతో అల్లాడిపోయింది.

### రాజకీయ అస్థిరత

'గరీబీ హఠావో' నినాదంతో అధికారంలోకి వచ్చిన ఇందిర.. ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకొన్న దాఖలాలు కనిపించవు. మన రాష్ట్రానికే వస్తే...

మిగతా 3వ పేజీలో..

### దడ పుట్టించిన ద్రవ్యోల్బణం

ఇందిర హయాంలో పాశ్చాత్య దేశాలతో దౌత్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉండటంతో ఆయా దేశాల నుంచి భారత్ దిగుమతి చేసుకొనే చమురు, ఎరువులపై వాటి ప్రభావం పెద్దయెత్తున పడింది. దీంతో దేశంలో నిత్యావసర ధరలు మండిపోయేవి. ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం, విధానపరమైన లోపాలతో 1975–76లో ద్రవ్యోల్బణం 25 శాతానికి ఎగబాకింది.

### ఆకలి కేకలు



ఒకవైపు పెరుగుతున్న ధరలు, మరోవైపు ఆహార సంక్షోభం వెరసి ఇందిర జమానాలో అమెరికా, రష్యా తదితర దేశాలు పంపే తిండి గింజల కోసం భారత్ ఆశగా ఎదురు చూడాల్సిన దుస్థితి తలెత్తింది. ఒకసారి భారత్‌కు గోధుమలను పంపించే నౌకను అప్పటి అమెరికా అధ్యక్షుడు లైండన్ బీ జాన్సన్ ఉద్దేశపూర్వకంగా పోర్టులోనే కొద్దిరోజులు నిలిపేశారు. దీంతో భారతీయులంతా విలవిల్లాడిపోయారు. చివరకు భారత్ అభ్యర్థన మేరకు జాన్సన్ నౌకను విడుదల చేశారు.

### ఎమర్జెన్సీ చీకటి రోజులు

1975 జూన్ 25న ప్రారంభమై.. 21 నెలలపాటు భారత ప్రజాస్వామ్యాన్ని చీకట్లోకి నెట్టేసింది ఇందిర ఎమర్జెన్సీ నిర్ణయం. రాయబరేలి నుంచి ఎంపీగా గెలిచిన ఇందిర.. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడినట్టు సోషలిస్టు నాయకుడు రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టులో ఆమె ఎన్నికను సవాల్ చేశారు. దీంతో ఇందిర ఎన్నిక చెల్లదని కోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై సుప్రీం స్టే ఇచ్చింది. అయితే, ఇందిర ప్రభుత్వ ఏకపక్ష వైఖరి, ప్రభుత్వంలో నెలకొన్న అవినీతిని వ్యతిరేకిస్తూ అప్పటికే విపక్ష నాయకులు జయప్రకాశ్ నారాయణ్, మొరార్జీ దేశాయ్ ఆందోళనలను తీవ్రతరం చేశారు. ఉద్యమం క్రమంగా దేశమంతటా పాకింది. పరిస్థితులు చేజారిపోతుండటాన్ని గమనించిన ఇందిర.. కేవలం తన పదవిని కాపాడుకోవడానికి ఓ నిర్ణయానికి వచ్చారు. కేంద్ర కేబినెట్ ఆమోదం తీసుకోకుండానే అత్యయిక స్థితి (ఎమర్జెన్సీ) విధిస్తున్నట్టు ప్రకటించారు. అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ వ్యతిరేకించకుండానే దీనికి ఆమోదం వేశారు. ఎమర్జెన్సీ చీకటి నిర్ణయంతో పౌరుల హక్కులన్నీ మంటగలిశాయి. ప్రజాస్వామ్య సంప్రదాయాలు, విలువలకు ఇది గొడ్డలిపెట్టుగా మారింది. ఇందిర నిరంకుశ ధోరణిని ప్రశ్నించిన గళాల గొంతునొక్కారు. నిరసించిన కలాలను కాలరాశారు. విపక్ష నేతలను జైళ్లల్లో పెట్టారు. న్యాయస్థానాలు, పత్రికలపై ఆంక్షల పర్వం కొనసాగింది. ప్రజావ్యవస్థ అస్తవ్యస్తమైంది. ఎక్కడ చూసినా దారుణాలు, లూటీలు, హక్కుల ఉల్లంఘనలే.


DIAN HERA
SPECIAL SUPPLEMENT
EMERGENCY DECLARED
JP, Morarji, Advani, Asoka Mehta & Vajpayee arrested

| ఇందిరమ్మ పాలనలో (ఉమ్మడి ఏపీ) | |
|---|---|
| జీఎస్డీపీ | రూ. 320 కోట్లు |
| తలసరి విద్యుత్తు వినియోగం | 36 యూనిట్లు |
| విద్యుత్తు సరఫరా | 3-7 గంటలు |
| ధాన్యం ఉత్పత్తి | 12 లక్షల టన్నులు (తెలంగాణ) |

| కేసీఆర్ పాలనలో ఇప్పుడు (తెలంగాణ) | |
|---|---|
| జీఎస్డీపీ | రూ. 13.28 లక్షల కోట్లు |
| తలసరి విద్యుత్తు వినియోగం | 2,166 యూనిట్లు |
| విద్యుత్తు సరఫరా | 24 గంటలు |
| ధాన్యం ఉత్పత్తి | 2.6 కోట్ల టన్నులు |



### అలా జరగాల్సింది కాదు

దేశంలో అత్యయిక స్థితి (ఎమర్జెన్సీ) విధించకుండా ఉండాల్సింది.

- దేశ అత్యున్నత న్యాయస్థానం 'సుప్రీంకోర్టు' (2020 డిసెంబర్ 14)

### ముమ్మాటికీ పొరపాటే

ఎమర్జెన్సీ విధింపు కచ్చితంగా పొరపాటే.. మా నాయనమ్మ ఇందిరా గాంధీ కూడా ఆ విషయాన్ని అంగీకరించారు.

- రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత (2021 మార్చి 3)